# గావెల్ అక్రమ రవాణా

- చోద్యం చూస్తున్న అధికారులు



పెండ్లిమర్రి, ఆగస్టు 19, ప్రభాతవార్త

మండలంలోని గంగనపల్లె పంచా యతీలోని రాచవారిపల్లె గ్రామ సమీ పంలో రెండు రోజులుగా జోరుగా గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. దీంతో రాచవారిపల్లె గ్రామస్థులు రోడ్డు దెబ్బతిని దుమ్ము ఎగసిపడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహా రిస్తున్నారని వాపోతున్నారు. ఏది ఏమైనా ఇష్టం వచ్చినట్లు గ్రావెల్ తరలించడం అన్యాయమని దీనిపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మైనింగ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వారు ఇటువైపు తొంగి చూసిన పాపాన పోలేదని వాపోయూరు. స్పందించిన పెండ్లిమర్రి ఎస్సై రాజరాజేశ్వర్‌రెడ్డి, సిబ్బంది దాడులు చేసి రెండు టిప్పర్లను, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అనుమతి ఉంటేనే గ్రావెల్ తరలించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


# వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
శనివారం 20 ఆగస్టు 2022


## పండుగలు సాంప్రదాయాలకు ప్రతీకలు




వేంపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త

పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్ట మిని పురస్కరించుకుని వేంపల్లెలోని ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో పండుగలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం, పరమత సహనం, సమైక్యతా భావం పెంపొందుతాయన్నారు. అనంతరం శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఉన్న చిన్నారులచే ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మెప్మా పీ.డి ఆరోగ్యంతో తిరిగి విధుల్లోకి రావాలి

ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా



కడప, ఆగస్టు 19 ప్రభాతవార్త :

స్థానిక అరుణాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెప్మా పీడి రామ్మోహన్ రెడ్డిని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా పరామర్శించారు. గత బుధవారం కడప శివార్లలోని పబ్బాపురం సమీపంలో బైపాస్ రోడ్డు సర్కిల్ వద్ద జరిగిన కారు ప్రమాదంలో.. కడప మెప్మా పీడి రామ్మోహన్ రెడ్డి భార్య ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అదే ప్రమాదంలో పీడి రామ్మోహన్ రెడ్డి కూడా తీవ్రంగా గాయపడి ప్రాణాపాయం నుండి బయట పడగలిగారు. ప్రస్తుతం కడప నగరంలోని అరుణాచలం ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న ఆయనను శుక్రవారం ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా పరామర్శించారు. పీడి ఆరోగ్య పరిస్థితి గురించి హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి.. ఆయన త్వరతగతిన కోలుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే, రామ్మోహన్ కుటుంబ సభ్యులకు, మనోధైర్యం, నైతిక మద్దతుతో పాటు ఎలాంటి అవసరం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని భరోసా ఇవ్వడం జరిగింది. ఆ అల్లాహ్ దయతో రాంమోహన్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకొని తిరిగి విధుల్లో చేరాలని మనసారా కోరుకుంటున్నానని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ షఫీ, మెప్మా ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గంగులయ్య, తదితరులు పాల్గొన్నారు.


# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## సభ్యత్వ నమోదు, బాదుడే బాదుడు కార్యక్రమాలు చేపట్టాలి

## - విజయమ్మ, రితీష్‌రెడ్డికి చంద్రబాబు సూచనలు

బద్వేలు, ఆగష్టు 19 ప్రభాతవార్త :

పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్ రెడ్డిలకు సూచనలు ఇచ్చారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో సమీక్ష నిర్వహణలో భాగంగా పార్టీ కార్యాలయంలో చంద్రబాబును విజయమ్మ, రితీష్ రెడ్డిలు కలిశారు. దాదాపు 2 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం విజయమ్మ, రితీష్ రెడ్డి లు మాట్లాడుతూ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలిచేందుకు ఇప్పటి నుండి పార్టీ కార్యక్రమాలపై చేపట్టవలసిన ప్రణాళిక గురించి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించడం జరిగిందన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలలో కార్యకర్తలు, నాయకులను భాగస్వామ్యులు అయ్యే య విధంగా చూడాలన్నారు. అలాగే బాదుడే బాదుడు కార్యక్రమాలు కొనసాగిచడం వలన ప్రజలకు మరింత దయ్యేరయ్యే అవకాశం ఉంటుందని, ఎన్నికల దగ్గర పడుతున్న సందర్భంగా సిద్ధం కావాలని తెలియజేసినట్లు వారు తెలిపారు. నియోజకవర్గంలో క్లస్టర్, యూనిట్లు, బూత్ ఏజెంట్లు కీలకం అని, ప్రణాళికతో ముందుకెళితే విజయం సులభతరం అని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు. ఇప్పటి నుండే ప్రజలలోకి వెళ్ళి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, ఇచ్చిన మాటలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమవుతున్న అంశాలను వారి దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. ప్రజల నుండి రోజు రోజుకూ తెలుగుదేశంకు ఆదరణ పెరుగుతుందని, చురుగ్గా కష్టపడి పనిచేస్తే గెలుపు మనదే అని వారు తెలియజేసినట్లు తెలిపారు.



చంద్రబాబును సన్మానించిన విజయమ్మ, రితీష్ రెడ్డి.

# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

## రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త

రాష్ట్రంలోని దళిత జాతికి చెందిన ప్రతిఒక్కరు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని ఆయన ఆశయాల అడుగుజాడల్లో పయనించాలని దళితులకు రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమోడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం తిరుపతి నుండి బద్వేల్‌కు వెళుతున్న సందర్భంలో రైల్వేకోడూరులోని దళిత నాయకుల విజ్ఞప్తి మేరకు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకంతో పాటు పూలమాలలో ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దళితులను అభివృద్ధిపరిచేందుకే ఈ కమిషను పనిచేస్తున్నదని, ముఖ్యంగా రాష్ట్రంలో ఏ దళిత కుటుంబం ఇబ్బందులు పడకుండా మానవ సమాజంలో స్వేచ్ఛగా జీవించేందుకు వారికోసం నిరంతరం శ్రమిస్తానని ఆయన అన్నారు. బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన స్వాతంత్ర్య ఫలాలతో ప్రతిఒక్కరు అభివృద్ధి బాటలో పయనించాలని, ఉన్నతస్థాయి చదువులతో రాజ్యాంగం పట్ల గౌరవ మర్యాదలతో సమాజంలో జీవించాలని అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో ప్రతిఒక్క దళితుడు అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరుకు చెందిన ప్రముఖ దళితులు రైల్వేకోడూరు నియోజకవర్గంలో స్మశానవాటిక లేదని, గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సమస్యలు ఉన్నాయని, ఉపాది కూలీలకు కూలీ సరిపోకపోవడంతో వారికి జీవనోపాది ద్వారా ఉపాదిని కల్పించి ఆ సమయంలో అంబేద్కర్ ఆశయాలను తెలియజేసే విధంగా మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఈ విషయాన్ని ప్రభుత్వం ద్వారా చర్చించి రాష్ట్రమంతటా దళితుల అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రాలను విక్టర్‌ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐకి చెందిన మణి, ఆర్‌వి రమణ, మందపాటి శంకరయ్య, సుబ్బనరసయ్య, తిప్పన దుర్గయ్య, సుబ్బారావు, రవీంద్ర, సురేష్‌తో పాటు రైల్వేకోడూరుకు చెందిన దళితులు పాల్గొన్నారు. అనంతరం విక్టర్‌ప్రసాద్‌ను పూలమాలలతో, శాలువాలతో ముంచెత్తారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న దళిత నాయకులు

## ఉపాధ్యాయుల హాజరు నమోదుకు ప్రభుత్వమే సెల్‌ఫోన్లు అందివ్వాలి

- ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



వేంపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

వేంపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త :

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల హాజరు నమోదుకు రాష్ట్ర ప్రభుత్వమే సెల్‌ఫోన్లను సరఫరా చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వేంపల్లెలోని ఎస్టీయూ రీజనల్ కార్యాలయంలో వేంపల్లె, చక్రాయపేట మండలాల ఎస్టీయూ కార్యకర్తలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంక్షేమ పథకాల అమలు క్రమంలో ఒకవైపు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ, మరోవైపు విద్యార్థులకు నష్టం కలగజేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరంగా ఉంచాలని, ప్రతి పాఠశాలకు డేటా ఎంట్రీ ఆపరేటరును నియమించాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 70శాతం ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులు భర్తీ చేయకుండా, విలీనం పేరుతో 30వేల పోస్టుల పదోన్నతులు అని చెప్పి ప్రస్తుతం 8 వేల పోస్టులకే అనుమతికై దస్త్రం పెట్టడం ఉపాధ్యాయ లోకాన్ని మభ్యపెట్టడమే అన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, కౌన్సిలర్లు నరసింహారెడ్డి, నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, జి.శివారెడ్డి, ఓబుళరెడ్డి, ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వాసవీ మాతకు విశేష పూజలు

## 102 మంది ప్రత్యేక ఉభయదారులతో అమ్మవారికి అభిషేకం

బద్వేలు అర్బన్, ఆగష్టు 19 ప్రభాతవార్త :

శ్రావణ మాసం పురస్కరించుకొని నాల్గవ శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి తెల్లవారుజామునే వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వివిధ రకాల ప్రత్యేక పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం గతంలో అమ్మవారి 3 గ్రాములు బంగారు నగలకు సహకరించినటువంటి 102 మంది శాశ్వత ఉభయదారులతో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకంతో పాటు వివిధ రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది. పలువురు శాశ్వత ఉభయదాతలు వాసవీ అమ్మవారికి పాలాభిషేకం చేసి తమ భక్తిని చాటుకున్నారు. భక్తాదులందరికీ ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి, అనంతరం ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, ట్రెజరర్ ఇమ్మడిశెట్టి చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ దర్శి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పబ్బతి చక్రపాణి, మెంటా నాగేశ్వరరావు, చాటకొండు వెంకట సుబ్బయ్య, బెస్తవేముల శ్రీనివాసులు, మునగా గోవిందు, యల్లనూరు రమణ, సముద్రాల పుల్లయ్య, ఉరిమి సుబ్బారావు, జొన్నలగడ్డ సుధాకర్‌తో పాటు ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు బచ్చు సుబ్రమణ్యం, పిండి లక్షుమయ్య, సగళా రాధాకృష్ణమూర్తి, ఆంజనేయులుతో పాటు పలువురు కమిటీ సభ్యులు, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



**అమ్మవారిశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు :**

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక అమ్మవారిశాలలో శుక్రవారం ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం కుంకుమార్చన కార్యక్రమాన్ని పలువురు మహిళల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చేపట్టారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజా, మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మీ, దేవతి లలిత, గంగిశెట్టి ధనలక్ష్మీతో పాటు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు

## డిఎస్పీ శ్రీధర్





రాయచోటి రూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త :

రాయచోటి పట్టణంలో ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ట్రాఫిక్ సమస్యపై ఎటువంటి ఇబ్బంది కలగకుండా సహకరించాలని ఆటోలకు వాహనదారులకు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఆటోలు ద్విచక్ర వాహనాలు సౌండ్ సిస్టం లేకుండా కంపెనీ ఇచ్చిన ప్రకారమే వాహనాలు నడపాలని అలా నడప కపోతే తమ వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యపై ఫుట్పాతులపై వాహనాల మీద 700 కేసు నమోదు చేశామన్నారు. ఆటోల మీద పిచ్చిపిచ్చి వ్రాతలో రాయకుండా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వాహనాలు నడపాలని తెలిపారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసువారికి సహకరించాలని అన్నారు వాహనాలు నడిపేటప్పుడు ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డిఎస్పి శ్రీధర్ తెలిపారు. పొరపాటున యాక్సిడెంట్ జరిగితే ఇన్సూరెన్స్ కూడా రాదని పట్టణంలో రోడ్లు వెడల్పు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తీర్చే అవకాశం ఉన్నదని తెలిపారు ఈ కార్యక్రమంలో అర్బన్ సుధాకర్ రెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త :


పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 7వ వార్డు రామ్‌నగర్ సచివాలయ పరిధిలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా అందుతన్నాయో అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల వల్ల ప్రతి కుటుంబానికి ఎంతమేర లబ్ది కలిగిందో వివరించారు. వైఎస్‌ఆర్ సిపి మూడేళ్ళ పాలనలో ప్రజలకు ప్రభుత్వం నేరుగా అందించిన సంక్షేమ పథకాలు పంపిణీపై ఇంటింటికి వెళ్ళి నేరుగా ప్రజలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకొన్నారు. కాలనీలో సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన తాగునీటి సరఫరాకు పైప్‌లైన్, మురుగుకాలువలు నిర్మించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. పిల్లల భవిష్యత్తు, మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ముఖ్యమంత్రి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ప్రజల సంక్షేమ పథకాలకు ఎలాంటి లోటు రానివ్వకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్ళడం ప్రజలందరూ గమనిసున్నారన్నారు. ప్రతి ఇంటిటోనూ జగనన్న సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ నూర్‌అజాం, కమీషనర్ ప్రమీల, డిఈ శిరీష, కౌన్సిలర్లు లత, శారదారెడ్డి, డిష్ రామక్రిష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, ఎస్‌వి.రమణ, రాజేష్,భాను, వైఎస్‌ఆర్ సిపి నాయకులు రఫి, ఎస్‌ఎ.కరీముల్లా, సుధాకర్, బావాజాన్, ఆంజినేయులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకొంటున్న ఎమ్మెల్యే

## ఎంపి, ఎమ్మెల్యేల కృషి ఫలితమే బిటి కళాశాల ప్రభుత్వపరం

రాయలసీమ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు



మదనపల్లె(విద్యావిభాగం), ఆగస్టు 19 ప్రభాతవార్త :

బిటి కళాశాల ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాల కృషి ఎంతో ఉందని రాయలసీమ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఆకుల కిరణ్ అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే నవాజ్‌బాషాను కలసి కిరణ్ సన్మానించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ బిటి కళాశాలను ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని అనేక ఏళ్ళుగా ఉద్యమాలు చేపట్టామన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారే తప్పా మా సమస్య మాత్రం అలాగే ఆగిపోయిదని గుర్తు చేసుకొన్నారు. 2015లో ప్రతిపక్షంలో ఉన్న మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా వైకాపా అధికారంలోకి రాగానే తప్పక మీ సమస్యను నెరవేర్చుతానని హామీ ఇచ్చారన్నారు. 2019లో వైకాపా అధికారంలోకి రాగానే ఎంపి, ఎమ్మెల్యేలు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి సిద్ధమయినట్లు తెలిపారు. బిటి కళాశాల ప్రభుత్వ పరం కావడంతో రాయలసీమ చరిత్రలో ఇది ఓ సువర్ణ అధ్యాయమని, ఎంపి, ఎమ్మెల్యేలు చిరస్థాయిగా గుర్తిండి పోతారన్నారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## 5.45 ఎకరాల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ పై చర్యలు తీసుకోవాలి

టిడిపి ఇన్‌చార్జి ప్రమీణ్‌కుమార్ రెడ్డి డిమాండ్

వార్త IV వ పేజీలో

# అక్రమంగా ప్రహరీగోడ నిర్మాణం

## - అడ్డుచ్చిన అత్తా కోడలిపై ప్రత్యర్థుల దాడి

మదనపల్లెక్రైం, ఆగస్టు 19 ప్రభాతార్త :

ఇళ్ళకు వెళ్ళేందుకు దారిలేకుండా గోడ నిర్మిస్తుండగా అడ్డుకోబోయిన అత్తాకోడలిపై ప్రత్యర్థులు ఇనుపరాడ్లతో పైశాచిక దాడి చేసి తీవ్రంగా గాయపడిన అత్తాకోడలు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇందుకు సంబందించిన వివరాలిలావున్నాయి. కురబలకోట మండలం అంగళ్ళు పంచాయితీ బ్రాహ్మణ వడ్డిపల్లెకు చెందిన గౌని పెద్దరెడ్డప్ప, లక్ష్మన్న, చిన్నరెడ్డెప్ప, మంజు అలియాస్ మంజునాథ్ అనే ముగ్గురు గ్రామంలోని ఓ వీధిలో దౌర్జన్యంగా పొరుగింటి వారు ఇంటినుంచి బయటకు వెళ్ళేందుకు దారిలేకుండా వీధికి అడంగా గురువారం ప్రహరీగోడను నిర్మించారు. గోడ నిర్మిస్తున్న సమయంలో ఇళ్ళకు దారి లేకుండా గో నిర్మిస్తే ఎలాగంటు వీధిలోని వెంకటరమణ భార్య రమణమ్మ, అమె కొడలు నాగవేణి, మల్లికార్జున తదితరులు గౌనిపెద్దరెడ్డెప్పను నిలదీశారు. మా ఇళ్ళ ముందు దారి వదిలే ప్రసక్తే లేదన్నారు. ఇరువురి మధ్య గోడవ జరిగింది. ఇంటిలో ఎవరూలేనందున ప్రత్యర్థులను ఎదురించలేక మిన్నకుండి పోయారు. సాయంత్రం పెద్దరెడ్డెప్ప వర్గీయులు రమణమ్మ, నాగవేణిలు దూషిస్తున్నారన్న ఆగ్రహంతో ఇనురాడ్లు తీసుకెళ్ళి చితకబాదారు. విచక్షణారహితంగా కొట్టడంతో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకొన్నారు. విషయం తెలుసుకొన్న రమణమ్మభర్త వెంకటరమణ, నాగవేణి భర్త మల్లికార్జున బాధితు లను చికిత్సల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. దాడిలో గాయపడ్డ రమణమ్మ పరిస్తితి విషయంగా ఉండడంతో తిరుపతికి తీసుకెళ్ళాలని సూచించారుర. మరొకరు ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఆసుపత్రిలో చికిత్సలు పొందుతోంది. ఈ విషయంపై ముదివేడు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు బాధితులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని తెలిపారు.




# పోలీసులకు సవాలుగా నిలిచిన రెడ్డికోట చోరీ కేసు

- గ్రామంలోని ప్రతి వ్యక్తి వేలిముద్రల సేకరణ - చోరీ కేసు చేదిస్తాం : డీఎస్పీ మనోహరాచారి


తంబళ్లపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త

తంబళ్లపల్లె మండలం రెడ్డికోట గ్రామ నడిబొడ్డులో బుధవారం రాత్రి సిగి రామస్వామి ఇంటిలో భారీ ఎత్తున చోరీ జరిగిన విషయం పాఠకులకు తెలిసిందే. తంబళ్లపల్లె మండల చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున బంగారం దోపిడీ జరిగిన సంఘటన ఇదే కావడం విశేషం. చోరీ జరిగిన రాత్రి వీధిలైట్లు తీసివేయడం, ఇంటితలుపులు పగలగొట్టి ఇంటిలోని బీరువా తాళం తొలగించి 250 గ్రాములు బంగారు చోరీ చేసి అనంతరం తిరిగి ఇంటికి కొత్త తాళం వేసి వెళ్లడంతో ఈ చోరీ స్థానికుల ప్రమేయంతో జరిగిందా అనే అనుమానంతో దర్యాప్తు చేస్తున్నారు. ఆ రోజు రాత్రి రామస్వామి అతని భార్య నీలావతి బోరు వద్ద కాపలా వెళ్లగా అదే రోజు కుమారుడు బాలకృష్ణ కుటుంవబం తిరుమలకు మొక్కుబడి కోసం వెళ్లారు. ఇదే సమయంలో దొంగతనం జరగడంతో గ్రామస్థులు సైతం పలు రకాల అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి డీఎస్పీ ఆధ్వర్యం లో వేలిముద్ర నిపుణులను రప్పించి గ్రామంలోని ప్రతి ఒక్కరి వేలి ముద్రలను రాత్రి పొద్దు పోయే వరకు సేకరించారు. రెడ్డికోట తంబళ్లపల్లె మండలం పోలీసుస్టేషన్ కేంద్రానికి సుమారు 25కి.మీ దూరంలో ఉండడంతో పోలీసు పర్యవేక్షణకు కొంచెం కష్టంగా ఉంది. కష్టపడి పనిచేసి సంపాదించుకున్న బంగారు పోవడంతో ఆ నిరుపేద రైతు రామస్వామి కుటుంబం పోలీసులకు మొరపెట్టుకున్నారు. ఏది ఏమైనా ఈ చోరీ కేసును చేధించి తీరుతామని భవి ష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసకొని మారు మూల గ్రామాల్లో సైతం పర్యవేక్షణ మహిళా పోలీసుల సహకారంతో ముమ్మరం చేస్తామని డీఎస్పీ మనోహరాచారి ధీమా వ్యక్తం చేశారు.



# పైపైకి...పసిడి...!

- శుభకార్యాల వేళ సామాన్యులకు అందని బంగారు ధరలు
- పదిగ్రాములు 24క్యారెట్లు రూ.52వేలు



పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 19 ప్రభాతవార్త :

బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. శుభకార్యాల వేళ పెరగుతున్న ధరలు సామాన్య ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. బంగారం దరలు గుర్రపు స్వారీలా పరుగులు పెడుతున్నాయి. ధరలు పెరగడానికి కారణం ఆర్థిక మాంధ్యంతో పాటు రూపాయితో డాటర్ మారకం విలువ తగ్గడమేనంటున్నారు వ్యాపారులు. డాలర్‌తో పోల్చితే రుపాయి అంతర్జాతీయంగా పోటీ పడలేక పోతుండడం, పతనం దిశగా ఉండడంత ధరలు పెరుగుదల నమోదవుతుందంటున్నారు. ఇక పుత్తడిపై పెట్టుబుడులు పెట్టేవారి సంఖ్య పెరగడంతో పోటీ నెలకొంది. పదిగ్రాముల బంగారం 24క్యారెట్లు రూ.52,000లకు పైగా 22 క్యారెట్లు రూ.44,970లకు చేరడంతో సామాన్యులు తమకు ఉన్న కాడికి కొనుగోలు చేస్తున్నారు. పదిరోజుల క్రితం 10గ్రాముల బంగారు 24క్యారెట్లు 48,700లు ఉండగా 22 క్యారెట్లు రూ.42,250లు ధరలు ఉన్నాయి. అంటే దాదాపు పదిరోజుల్లోనే సుమారు రూ.2వేలు వరకు ధర పెరగడం గమనార్హం. శుభకార్యాలకు శుభసూచికం కావడంతో మద్యతరగతి కుటుంబాలు 20తులాలు కొనాల్సిన చోట 10తులాలు, 5తులాలతో సరిపెట్టుకొంటున్నారు. సమాజంలో 60శాతం మేర ప్రజలు సామాన్యులు, మద్య తరగతి కుటుంబాలే. దీంతో సంపన్నులతో పోలిస్తే వీరి కొనుగోల్లే వ్యాపారులకు ప్రధానం. మార్కెట్‌లో వీరి వాటానే అధికం. గత 5ఏళ్ళ క్రితంకు ఇప్పటికి దాదాపుగా 40నుంచి 50శాతం మేర ధరలు పెరిగాయి. ఏది ఏమైనా వివాహాలకు, శుభకార్యాలకు పసిడి కొనాలంటే సామాన్య ప్రజలు జంకుతున్నారు.

# వామ్మో...పులి...

IIలో

## ప్రభుత్వ ఉపాధ్యాయులను వేధించడం తగదు

**ఆర్పిఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పోతుల నాగరాజు**

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 19 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులను వేధించడం తగదని రిజర్వే షన్ల పరిరక్షణ సమితి (ఆర్పీఎస్) జాతీయ అధ్యక్షుడు పోతుల నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులను రకరకాల వేధింపులతో ఇబ్బందులకు గురి చేస్తూ ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన న్యాయమైన పిఆర్సీ, హెచ్ ఆర్ పాలసీని అడిగినందుకు, సిపిఎస్ రద్దు చేయమని డిమాండ్ చేసినందుకు గాను ముఖ్యమంత్రి జీఓ తీసుకువచ్చి ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తున్నారని, ఇలాంటి చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బయోమెట్రిక్ అమలులో వున్న చోట నెట్ సౌకర్యం లేత ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడటం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, శ్రీకాంత్, తిరుపాల్, సదాశివయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో క్రిష్ణాష్టమి వేడుకలు

చింతకొమ్మదిన్నె అగస్టు:19 ప్రభాతవార్త



క్రిష్ణాష్టమి వేడుకల సందర్భంగా భక్తులు శుక్రవారం ఉదయం నుండి శ్రీకృష్ణుని అలయాల వద్ద భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి తీర్ధ ప్రసాదాలు సమర్పిం చారు. అప్పరాజుపల్లె సమీపంలో శ్రీక్రిష్ణచారిటబుల్ ట్రస్ట్ చేర్మెన్ అవుల అమర్‌నాధ్‌యాదవ్ దంపతుల అద్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీక్రిష్ణనికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్ద ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఎర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోనే కాకుండా కడప నగరం నుండి వైద్యులు అనేక మంది స్వామివరిని దరించుకోని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగిరెడ్డిపల్లె, ఊటుకూరు తదితర గ్రామాల్లో శ్రీక్రిష్టాష్టిమి వేడుకలు ఘణంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమృతానగర్‌లో మట్కా

**– అప్పుల పాలవుతున్న పేదల బతుకులు**

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 19, ప్రభాతవార్త

మట్కా మహమ్మారి పేదల బతుకులను ఆర్థిక కష్టాల పాలు చేస్తోంది. దీనిని నియంత్రించాల్సి న పోలీసుశాఖ మామూళ్ల మత్తులో వారిని పట్టించుకోవడం లేదన్నది ప్రజల మాట. రూరల్ పరిధిలోని అమృతానగర్‌లో దాదాపు 4వేల కుటుంబాలు పేదలు నివాసముంటున్నారు. వీరు చిరు వ్యాపారాలు. కూలి పనికి వెళ్లేవారు, ఆటో నడిపే ఎక్కువ. పేద ప్రజలకు మట్కా వల్ల రూ.10కడితే రూ. వెయ్యి, రూ.100 కడితే రూ.10వేలు వస్తుందని ఆశతో అప్పుల ఊబిలోకి వెళ్తున్నారు. మహిళలు, మగవారు అన్న తేడా లేకుండా మట్కా మహమ్మారి వలలో చిక్కుకొని బతుకు చిద్రం చేసుకుంటున్నారు. మట్కా నిర్వాహకులు ఒక్క అమృతానగర్‌లోనే 20 పైచిలుకు ఉంటే వీరి వ్యాపారం ఎలా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులకు మట్కా నిర్వహించే వ్యక్తులు ప్రతి నెల మామూళ్లు ఇస్తున్నందు వల్లే వారు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. పోలీసులకు ఎవరైనా డబ్బు ఇవ్వని వారిని పట్టుకుంటూ మట్కా నిర్వాహకులను పట్టుకున్నామని చెప్పుకుంటారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు మట్కాపై ఉక్కు పాదం మోపి పేద ప్రజలను పట్టి పీడిస్తూ ఈ మహమ్మారిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వేడుకలు

గుర్రంకొండ, ఆగస్టు 19, ప్రభాతవార్త

శ్రీకృష్ణ జయంతి వేడుకలను శుక్రవారం స్థానికులు భక్తిశ్రద్దలతో జరుపుకొన్నారు. ఉదయం నుండీనే స్థానిక మహిళలు ఇళ్ళలోనే పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మరికొంత మంది మహిళలు వరలక్ష్మివ్రతాలు నిర్వహించి పూజలు చేయడం జరిగింది. భక్తులు ప్రముఖ ఆలయాలైన తరిగొండ శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయం, చెర్లోపల్లెలో శ్రీరెడ్డెమ్మతల్లి దేవస్థానంకు, గుర్రంకొండ కొత్తపేటలోని శ్రీపోలేరమ్మ ఆలయం, ఇందిరమ్మకాలనీలో సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించడం జరిగింది.

## ఎట్టకేలకు తవళంకు రాత్రి సర్వీసు

**ప్రయాణీకులు హర్షం**


నిమ్మనపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త:



నిమ్మనపల్లె మండలం తవళం మీదుగా నడిచే బస్సు గత కొంతకాలంగా నిలిపివేయడంతో ఈ మార్గంలో ప్రయాణీకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సమస్యను మదనపల్లె రెండవ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్, సిఐ గీతతో ప్రయాణీకులు పలు దపాలుగా విన్నవించారు. ఫలితంగా తవళంకు 10 సింగల్స్‌లో నైట్ సర్వీసు నడుస్తోంది. అధికారుల మేరకు ప్రతిరోజూ ఉదయం 6.15, 10.30 మధ్యాహ్నం 1.45, సాయంత్రం 5.30, రాత్రికి 9గంటలకు మదనపల్లెలో బస్సు బయలుదేరి తవళం మీదుగా నిమ్మనపల్లెకు చేరనున్నది. అదే విధంగా ఉదయం 10.30, మధ్యాహ్నం 1.45, సాయంత్రం 5.30 సింగల్స్ మాత్రం ఇదే మార్గంలో నిమ్మనపల్లె మీదుగా కందూరు వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో మదనపల్లెకు బస్సు చేరుకుంటుంది. రాత్రి 9గంటలకు బయలుదేరి బస్సు ప్రతిరోజూ నైట్‌ఆల్ట్ చేయనున్నట్లు తెలిపారు. ఈ బస్సు ప్రవేశపెట్టడంతో ఆర్టీసి అధికారులకు మార్గంలోని ప్రయాణీకులు హర్షం తెలిపారు.

## క్రిష్ణాష్టమికి కలకళలాడిన దేవాలయాలు

నిమ్మనపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త:



మండలంలోని శ్రీక్రిష్ణాష్టమి సందర్భంగా శ్రావణ శుక్రవారం ఘనంగా దేవాలయాలు భక్తాదులతో కిటకిటలాడాయి. నూతనంగా నిర్మించిన తవళం పంచాయితీలోని ఉంటావారిపల్లెలో శ్రీక్రిష్ణ దేవాలయం అదే విధంగా తవళం శివాలయం అక్కదేవతల గుడిలో ప్రత్యేక పూజలు జరగగా ప్రతి గ్రామంలోనూ మహిళలు, ప్రతి గృహంలోనూ భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకలు జరిపారు.

## నిమ్మనపల్లె మండలంలో పంచముఖి ఆంజినేయస్వామి

నిమ్మనపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త



మండలంలో పంచముఖి ఆంజినేయులు ప్రజలను ఆకర్షిస్తున్నాడు. ఓ మొకం భీముడు, మరో ముఖం వరాహనుది, ఇంకో ముఖం అశ్వం, అచివరాన నరసింహులు ముఖం, మద్యలో ఆంజినేయులు మొఖం ఇలా పంచముఖాలు ఉన్న ఆంజినేయస్వామి విగ్రహం చాలా అరుదు. ఇలాంటి విగ్రహం అక్కడక్కడ ఒకటి, రెండు చోట్లు మాత్రమే కనపడుతుంది. మదనపల్లె-నిమ్మనపల్లె రోడ్డులో వశిష్టస్కూల్ పక్కన అక్కగార్ల కట్టమీద ఈ విగ్రహం నిర్మించారు. 25అడుగుల ఎత్తు గల ఈ విగ్రహాన్ని రూ.8లక్షలతో నిర్మించారు. తాళ్ళపాకలో నిర్మించిన అన్నమయ్య విగ్రహ శిల్పి డి.పెంచులయ్య ఈ విగ్రహాన్ని రూపకల్పన చేశారు. ఈ విగ్రహం తయారికి శిల్పులు ఏడాదిపాటు శ్రమించారు. ఈ విగ్రహ నిర్మాణానికి బెంగుళూరుకుచెందిన లయన్ పి.రంగరనాథ కుమార్తెలు గౌరమ్మ ప్రసాద్, కరుణమ్మ రామ్మోహన్‌రావులు రూ.3లక్షలు విరాళంగా అందజేశారు. వీరేకాకుండా మదనపల్లె పట్టణంలోని మరికొందరు కూడా విరాళాలు ఆందజేశారు. 2000లో నిర్మించిని అభయాంజనేయస్వామి గుడి వెనుక ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈపంచముఖ ఆంజినేయులు ఈ మార్గంలో వెళ్ళే ప్రతి ఒక్కరిని ఆకర్షిస్తునాడు.

## విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19, ప్రభాతవార్త



రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిం చాలని ఈనెల 23వ తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల అయినా పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్‌ఏ కడప నగరంలో వివిధ పాఠశాలల, జూనియర్, డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లను కలిసి బంద్‌కు సంబంధించిన నోటీసులు ఇచ్చి సహకరించాలని అపుస్మా ప్రైవేటు పాఠశాలల రాష్ట్ర అధ్యక్షుడు సాయిబాబా విద్యా సంస్థల డైరెక్టర్ రామచంద్రారెడ్డి, కృస్మా ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్ పాఠశాలల కరస్పాండెంట్ జోగి రామింరెడ్డి, ప్రైవేటు డిగ్రీ కళాశాలల రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ప్రవేటు విద్యా సంస్థల డైరెక్టర్ వికాస్ హరికృష్ణలను కోరారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఓ.నాగేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్ర ప్రసాద్, ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షులు పి.భరత్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సురేష్ సురేష్ నాయక్‌లు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన 2 నెలలు కావస్తున్నా ఇంత వరకు అయినా పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదని అదే విధంగా నూతన విద్యా విదానాన్ని దేశంలో ఏ రాష్ట్రాలు అమలు చేయలేదని కానీ, మన రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అమలు చేసి పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు చదువు దూరం చేస్తుందని కాబట్టి తరగతుల విలీనాన్ని ఉపసంహరించుకొని నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని అదే విధంగా సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, రాష్ట్రంలో ఉన్న విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం చేసే విధంగా జీవో 77ను రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన విడుదల చేయాలని రాష్ట్రంలో, జిల్లాలో ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు నియంత్రించాలని విద్యార్థులకు నష్టం కలిగించేలా ఉన్న పీజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షను రద్దు చేయాలన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ యాప్‌తో పెట్టుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని వారు అన్నారు. పై పేర్కొన్న సమస్యలు పరిష్కరించాలని ఈనెల 23వ తేదీన జరిగే బంద్‌ను విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

## సచివాలయ సిబ్బందిపై దాడిని ఖండిస్తున్నాం : ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19, ప్రభాతవార్త

సచివాలయ సిబ్బందిపై కొందరు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ తెలిపారు. ప్రజా స్వామ్యయుతంగా సమస్యలుంటే పరిష్కరించుకోవాలే తప్ప భౌతికంగా దాడి చేయడం శోచనీయమన్నారు. కొందరు రాజకీయ పలుకుబడితో ఉద్యోగుల పైకి రావడం సరైన విధానం కాదన్నారు. వెలుగులోకి రాని ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఇలాంటి వారి పట్ల రక్షణశాఖ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉద్యోగుల రక్షణకై ప్రత్యేక చట్టాన్ని తేవాలని కోరారు. లేకపోతే ప్రశాంతంగా విధులు నిర్వహించలేరన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19, ప్రభాతవార్త



కృష్ణాష్టమి సందర్భంగా పవన్ హైస్కూలు నందు అంగరంగ వైభవంగా విద్యార్థుల కేరింతల నడుమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాదాపు వంద మంది విద్యార్థులతో చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణతో శ్రీకృష్ణుడి లీలలు ఎంత మధురంగా ఉంటాయో కనుల విందుగా ఉట్టిపడేలా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలకు ఉచితంగా మందులు పంపిణీ

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 19 ప్రభాతవార్త



మండల కేంద్రమైన పిటిఎం గ్రామంలో పశువుల, గొర్రెలు, మేకలకు శుక్రవారం ఎంపిపి మహమ్మద్, సర్పంచ్ శంకర్‌లు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గొర్రెల కాపరులతో మాట్లాడుతూ మేకలకు ఎటువంటి వ్యాధులు సోకుండా మంచి ఆరోగ్యంగా ఉండాలని ఈ మందులను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

బి.కొత్తకోట, ఆగస్టు 19 ప్రభాతవార్త



మండలంలో ప్రజలు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల పలువురు తల్లిదండ్రులు చిన్నారులకు శ్రీ కృష్ణుని వేషం ధరింపజేసి ఆనందించారు. మరికొన్ని చోట్ల చిన్నారులకు రాధాకృష్ణల అలంకరణలో చూడముచ్చట గొలిపే విధంగా చిన్నారులను అలంకరించారు. నగర పంచాయతీ అయిన బి.కొత్తకోటలో పలు ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కరెంటు కాలనీలో చిన్నారులందరూ కృష్ణుడు, గోపికల అలంకరణతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

## బి.కొత్తకోటలో బాలుడు అదృశ్యం

బి.కొత్తకోట, ఆగస్టు 19 ప్రభాతవార్త



బి.కొత్తకోటలోని బీసీకాలనీకి చెందిన మహమ్మద్ షాహీద్(3) అనే బాలుడు శుక్రవారం ఉదయం 11 గంటల నుండి కనబడడం లేదని బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బి.కొత్తకోట బీసీ కాలనీకి చెందిన కె.జె.బావాజాన్, షబానా దంపతుల కుమారుడు మహమ్మద్ షాహీద్(3) అనే బాలుడు శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో బీసీకాలనీలో తమ ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయాడు. తమ ఇంటి ముందు ఆడుకుంటున్న కుమారుడు కనపడకుండా పోవడంతో తల్లిదండ్రులు వీధులన్నీ గాలించారు. మూడేళ్ల తమ చిన్నారి కుమారుడు కనపడలేదని తల్లిదండ్రులు బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాలుడు ఆడుకుంటూ కనబడకుండా పోయినప్పుడు లేత పసుపు రంగు టీషర్టు, తెలుపు రంగు నైట్ ప్యాంటు ధరించి వున్నాడని, బాలుడి ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్ కోరారు. బాలుడి ఆచూకీ తెలిస్తే మదనపల్లి డీఎస్పీ సెల్ నెంబర్ 9440796738, రూరల్ సీఐ సెల్ నెంబర్:9490617891, బి.కొత్తకోట ఎస్ఐ సెల్ నెంబర్:9440900707కు సమాచారం అందించి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## తంబళ్లపల్లెలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

తంబళ్లపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త



తంబళ్లపల్లె మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుక లను స్థానిక ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం తంబళ్ల పల్లె రామాలయం, కోసువారిపల్లి శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర ఆలయం, కుక్కరాజుపల్లి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆల యం, సాయిబాబా ఆలయాల్లో స్థానిక ప్రజలు ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు, అభిషేకాలు, దూప దీప నైవేద్యాలతో పాటు ప్రసాదాలు నైవేద్యంగా అర్పించారు. ఈ సందర్భంగా పలు చోట్ల కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులకు చిన్ని కృష్ణుని వేషధారణ వేయించి అలరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో చెక్క భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానాలు నిర్వహించారు.

## శ్రీ జ్ఞానాంభిక కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం

మదనపల్లెక్రైం, ఆగస్టు 19 ప్రభాతవార్త



పట్టణంలోని శ్రీ జ్ఞానాంభిక డిగ్రీ కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఈ కళాశాలలో స్టాటిస్టిక్స్ అధ్యాపకులు హిమశేఖర్‌కు శ్రీ వెంకటేశ్వర్ యూనివర్శిటి డాక్టరేట్ అవార్డు ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. ఈయన స్టాటిస్టికల్ మోడలింగ్ ఫర్ టైమ్ సీరీస్ ఎనాలిసిస్ అనే అంశంపై పరిశోదన గ్రంధాన్ని సమర్పించినందుకు గానూ డాక్టరేట్ ప్రధానం చేశారని పేర్కొన్నారు. ప్రొపెసర్ భూపతినాయుడు పర్యవేక్షణలో పిహెడి పూర్తి చేశారు. అధ్యాపకున్ని కళాశాల కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు అభినందించారు.

## మహా కుంబాభిషేకాన్ని విజయవంతం చేయండి

**– మల్లయ్య కొండ ఛైర్మన్ కె.ఆర్.మల్‌రెడ్డి**



**తంబళ్లపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త:** తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండ శివాలయంలో ఈనెల 22న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు మహా కుంబాభిషేకం, వరుణ యాగం పెద్దఎత్తున జరుగుతుం దని భక్తులు హాజరై విజయవంతం చేయాలని కొండ ఛైర్మన్ కె.ఆర్. మల్‌రెడ్డి, ఆలయ ఈవో మునిరాజాలు తెలిపారు. ప్రతి ఏటా మల్లయ్య కొండలో కుంబాభి షేకం, వరుణ యాగం నిర్వహిస్తే వర్షం పడుతుందని నాటికీ నేటికీ భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా మహా శివునికి దూప దీప నైవేద్యాలతో పాటు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు అనంతరం కుంబాభిషేకంతో పాటు వరుణ యాగం ప్రధాన అర్చకులతో నిర్వహిస్తారు. అన్నదాన కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

## ప్రిన్సిపల్ సుభద్రపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి

జమ్మలమడుగు, ఆగస్టు 19, ప్రభాతవార్త



పెద్దముడియం మండలం గుండ్లకుంట గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న గంగోత్రి అనే విద్యార్థి పాఠశాల ప్రిన్సిపల్ సుభద్ర లెట్రిన్, బాత్‌రూంలు కడిగించడం అన్యాయమని ఆమెపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్‌కు విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదును పరిశీలించి ప్రిన్సిపల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జమ్మలమడుగు డీఎస్పీకి సిఫార్సు చేశారు. గత నెల 10వ తేదీ జమ్మలమడుగు రూరల్ సీఐ, పెద్దముడియం ఎస్సైకి ఫిర్యాదు చేసినా ఇంత వరకు స్పందించలేదని బాలిక తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

## ఘన సన్మానం..

జమ్మలమడుగు, ఆగస్టు 19, ప్రభాతవార్త



జమ్మలమడుగు తెదేపా కార్యాలయంలో స్థానిక జమ్మలమడుగు నియోజకవర్గ వర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డిని, టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటు కార్యనిర్వహణ కార్యదర్శి సేగిరెడ్డి రామాంజ నేయరెడ్డి ఆధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కలిశారు. కడప పార్లమెంటు కార్యనిర్వహణ కార్యదర్శిగా తనను నియమించడానికి సహకరించిన భూపేష్‌రెడ్డి, గొరిగెనూరు సుధీర్‌రెడ్డిలను కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ టీఎన్ఎస్ఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడాలని పిలుపునిచ్చారు. జగన్ మోసపూరిత పాలనలో యువతకు ఉపయోగపడే ఒక్క పరిశ్రమ కూడా రాలేదని తెలిపారు. రాబోయే కాలంలో తెదేపా అధికారంలోకి తెచ్చే బాధ్యత యువతపైన ఉందని యువత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటు అధ్యక్షులు గొరిగెనూరు సుధీర్‌రెడ్డి, రంగనాథ్, సిద్ధూ, భాను, దస్తగిరి, మధు, తేజ, ప్రసాద్, సుభాన్, ఉపేంద్ర, మహేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పొటోగ్రఫీ డే సందర్భంగా రక్తదానం

జమ్మలమడుగు, ఆగస్టు 19, ప్రభాతవార్త



ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా జమ్మలమడుగు పట్టణంలోని ఫొటో మరియు వీడియో గ్రాఫర్లు మరియు అనుబంధ సంస్థ సభ్యులందరూ కలిసి శుక్రవారం ఫొటోగ్రఫీ కనుగొన్న దాగురే చిత్రపటానికి ఘనంగా ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షులు గురునాథ్ నివాళులు అర్పించారు. అనంతరం జమ్మలమడుగు పట్టణ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గురునాథ్ ఆధ్వర్యంలో సభ్యులందరూ రక్తదానం నిర్వహించారు. ఈ మేరకు 20 మంది ఫొటోగ్రాఫర్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. యూనియన్ నియమాల మేరకు ప్రజల వద్ద నుంచి ధరలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు మరియు వీడియో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, లోటాన్ ఫక్రుద్దీన్, శ్యాంసుందర్, విజయ్, సుబ్బు, వాని ప్రసాద్, రామనాథ్, జాయింట్ సెక్రటరీ రాజేష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కురబలకోటలో శ్రీక్రిష్ణ జన్మాష్టమి

కురబలకోట, ఆగస్టు 19 ప్రభాతవార్త:



మండలంలో శ్రీక్రిష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. తెట్టులోని శ్రీ సంతాన వేణుగోపాల్‌స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఛైర్మెన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## కాసులు కురిపిస్తున్న బొప్పాయి

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 19 ప్రభాతవార్త :

బొప్పాయి సాగు రైతుల ఇంట సిరులు కురిపిస్తున్నాయి. సాగుకు ఖర్చు తక్కువ, పంట ఎక్కువ లాభాలు వస్తుండడంతో రైతులు బొప్పాయి పంట సాగుపై ఆసక్తి కనపరుస్తున్నారు. గతంలో సీజన్‌లో మాత్రమే రైతులు పంట సాగు చేపట్టేవారు. కానీ ఇప్పుడు పట్టణాల్లో, నగరాల్లో బొప్పాయికి అధికంగా డిమాండ్ ఉండడంతో అన్ని కాలాల్లో ఈ బొప్పాయి పంటను సాగు చేస్తున్నారు. పిటిఎం మండంలోని గ్రామీణ ప్రాంతాల్లో కందుకూరు, టి.సదుం, మద్దయ్యగారిపల్లె, విసనకర్రవాండ్లపల్లె, మల్లెల వంటి గ్రామీణ పరిధిల్లో పంట పాలాల్లో బొప్పాయి సాగు ఈ ఏడాది ఎక్కువ విస్తీరణంలో సాగు చేపట్టారు. ఎకరం పొలానికి రూ.70వేలు ఖర్చు అవుతుంది. సంవత్సరానికి రెండు, మూడు సార్లు ఎరువులు, సేంద్రీయ ఎరువులతో పాటు ఆముదం పిండి, యూరియా, పోటాషియం వంటివి కూడా వేస్తారు. వీటికి సుమారు ఎకరాకు రూ.10వేలు ఖర్చు అవుతుంది. మొక్కలకు మందులు కలుపుకొని కొట్టడానికి కూలీలు,ఇతర ఖర్చులు కలిపి మరో రూ.15వేలు అదనంగా చివరకు పంటకు చేతికి అందేవరకు ఎకరాకు రూ.95వేలు ఖర్చు అవుతున్నట్లు గ్రామీణులు తెలిపారు. దిగుబడి బాగా వస్తే సుమారు అటో ఇటోగా 35టన్నుల కాయలు కోతకు వస్తాయి. పట్టణాల్లో, గ్రామాల్లో అన్న తేడా లేకుడా అన్ని చోట్ల ఈ బొప్పాయిను కొనుగోలు చేస్తుండడంతో గిరాకీ బట్టి అన్ని సీజన్‌లలో పంట సాగు చేయకడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎండకాలం, వర్షాకాలం, చలికాలం అన్న తేడా లేకుండా అన్ని కాలాల్లో ఈ పంటపై రైతులు మక్కువ చూపుతున్నారు. ఈ బొప్పాయి అమ్మేవారికి వ్యాపారంలో లాభాలు...తినేవాళ్ళకు ఆరోగ్యం దక్కుతుంది ఈ పంట వేసిన రైతులు కూడా లాభాల బాటలో పయనిస్తున్నారు.

## సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిగా మహేష్

రాజంపేట అర్బన్, ఆగస్టు 19 ప్రభాతవార్త



సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిగా రాజంపేటకు చెందిన పి.మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా రాయచోటిలో జరిగిన సిపిఐ మహాసభల అనంతరం పార్టీ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో జిల్లా సహాయ కార్యదర్శిగా పి.మహేష్‌ను ఎంపిక చేశారు. జిల్లా కమిటిలో తనకు అవకాశం కల్పించినందుకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. 23 ఏళ్లుగా కాలేజి కమిటి అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా విద్యార్థిరంగ సమస్యలపై పోరాటాలు చేసిన మహేష్‌ను పార్టీ గుర్తించి పదవికి ఎంపిక చేసింది. అలాగే జిల్లా కమిటిలో రాజంపేట నియోజకవర్గం నుంచి సభ్యులుగా ఎంఎస్ రాయుడు, ఎం.శివరామకృష్ణదేవర, కె.వెంకటయ్య, ఇ.సికిందర్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

## కనక దుర్గమ్మ అమ్మవారికి పూజలు


బద్వేలు అర్బన్, ఆగస్టు 19 ప్రభాతవార్త



స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వెలసిన కనక దుర్గమ్మ అమ్మవారికి శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం ఆలయ అర్చకులు ప్రదీప్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నిజ రూప దర్శనంలో కనక దుర్గమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు పబ్బతి చంద్రశేఖర్, దర్శి సుబ్బరాజా, వడ్లపూటి నాగభూషణంతో పాటు పలువురు ప్రత్యేక ప్రసాదాలు అందజేశారు.

## పాత ములకల చెరువులో మొహరం వేడుకలు

ములకల చెరువు, ఆగస్టు 19, ప్రభాతవార్త



ములకల చెరువు మండలం పాత ములకల చెరువు మరియు బురుజుపల్లి గ్రామాల్లో మొహరం వేడుకల్లో భాగంగా శుక్రవారం పీర్లు ఊరేగింపు నిర్వహించారు. యువకులు పీర్లను వివిధ రకాల పూలతో అలంకరణ చేసి అంగరంగ వైభవంగా డప్పులు, మేలతాళాల మధ్య వీధుల్లో ఊరేగింపుగా కుల మత బేధాలు లేకుండా నిర్వహించారు. ఈ మొహరం వేడుకలు ఇంకా రెండు రోజులు జరుగుతాయని ఆదివారంతో ముగుస్తాయన్నారు.వేడుకలకు గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటారని గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలు

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 19, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరులోని ఉప్పరపల్లి క్షేత్రంలోని శ్రీ సద్గురు సమర్ధ నారాయణ ఆశ్రమంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గోపూజ మహోత్సవం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామి వారిని ఊయలలో ఉంచి జోల పాట పాడుతూ తరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ములకల చెరువు, ఆగస్టు 19, ప్రభాతవార్త



ములకల చెరువు మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని వేపూరికోట సమీపంలో శ్రీ అవదూత ఆదినారాయణ స్వామి ఆశ్రమ ప్రాంగణంలో గల అతి పెద్ద శ్రీకృష్ణుని విగ్రహం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని విగ్రహానికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు వెంకట సుబ్బారెడ్డి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రివేళలో భజన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కురి ఆంజనేయరెడ్డి, వేపూరికోట, రెడ్డివారిపల్లె, సమీప గ్రామాల ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వ్యక్తిపై కేసు నమోదు

ములకల చెరువు, ఆగస్టు 19, ప్రభాతవార్త

ములకల చెరువు మండలంలోని పత్తికోటకు చెందిన చంద్రమోహన్ పంట నష్టం కలిగించిన కేసులు నిందితుడిగా ఉన్నారు. నిందితుడు ఎస్.చంద్రమోహన్‌కు గురువారం నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన ములకల చెరువు పోలీసులు రాజేష్‌కుమార్, మహేంద్రకుమార్‌లను నాపై కేసు నమోదు చేస్తారా అంటూ గట్టిగా అరుస్తూ నానా దుర్భాషలాడాడు. మీరు ఎంత లంచం తీసుకొని మాపై కేసు పెట్టారంటూ మిమ్మల్ని సస్పెండ్ చేయిస్తా మీ అంతు చూస్తా అంటూ సవాల్ విసిరాడు. అరుపులు విని ఊరి గ్రామ ప్రజలు అతనిని మందలించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు చంద్రమోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డీవై స్వామి తెలిపారు.

## అక్రమ వాహనాలపై పోలీసులు విస్తృతదాడులు

కలికిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మండల కేంద్రంలో రికార్డులు లేకుండా అక్రమంగా తిరుగుతున్న వాహనాలపై శుక్రవారం ఎస్ఐ లోకేష్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. స్టేషన్ ముందు, నాలుగు రోడ్ల కూడలిలో పోలీసులు నాకాబంది నిర్వహిస్తూ వాహనాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేకుండా అక్రమంగా తిరుగుతున్న వాహన యజమానులకు పోలీసులు జరిమానా విధించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ కొండప్ప, కానిస్టేబుల్ దినేష్, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.

## బీసీల సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్, ఆగస్టు 19, ప్రభాతవార్త



బీసీల కుల గణన జరపాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుడం రెడ్డిబాబు ప్రభుత్వాన్ని కోరారు. బీసీల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం కడప నగరంలోని పాత బస్టాండులోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శించారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రెడ్డిబాబు మాట్లాడుతూ బీసీల సమస్యల కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. బీసీల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వాలు తక్షణమే నెరవేర్చాలన్నారు. బీసీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి విభాగం, జాతీయ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డా.యు.ఎన్.ఆర్, జిల్లా అధ్యక్షులు మహ్మద్ యూసఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్, బీఎస్ఎన్ఎల్ వెంకటేష్, శ్రీహరి, ఆనంద్, వివేకానంద, ఖాదర్ బాషా, శ్రీదర్ పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త



మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లె లోని కోర్టులో నెలకొన్న శ్రీకృష్ణ దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణ పరమాత్మునికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్న పిల్లలు కృష్ణుడు వేషధారణలో ఉట్టి కొట్టడం అలరించాయి. చిన్న పిల్లలు శ్రీకృష్ణుని వేషధారణలో చేసిన సందడి చూపరులను ఆకట్టు కున్నాయి. విశ్రాంత ఉపాధ్యాయులు మరి కొంత మంది ఆలయంలో పూజలు నిర్వహించారు.

